క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్లు మరమ్మతుల దృష్ట్యా ముత్యాలంపాడు సెక్షన్ సత్యనారాయణపురం ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భగత్‌సింగ్ రోడ్డు, దండమూరి రామ్మోహన్‌వీధి, వందన పువారివీధి, శివాలయంరోడ్డు , శివరావువీధి, బ్రహ్మయ్యపంతులువీధి, నర్రావారివీధి, గిరీవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని అన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు): గిరిపురం ఇబ్రాయిల్‌వీధికి చెందిన కుక్కమల్ల కుమారి ఇటీవల మృతి చెందింది. ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తాత్కాలిక సాయం రూ. 10 వేలను 24వ డివిజన్ కార్పొరేటర్ అనిత మృతురాలి తల్లి ఎలిశమ్మకు శుక్రవారం అందజేశారు. మిగిలిన మొత్తాన్ని ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు అనిత తెలిపారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోమేపల్లి మృతి సాహితీ రంగానికి తీరనిలోటు



విజయవాడ కల్చరల్: ఏపీ రచయితల సంఘం అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మృతి సాహితీ రంగానికి తీరనిలోటని రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలాపాక ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కవిగా సోమేపల్లి కవితా సంపుటులు ప్రచురించినట్లు పేర్కొన్నారు. ఏపీ రచయితల సంఘం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సాహితీ సదస్సులు నిర్వహించారని తెలిపారు. ప్రభుత్వంలో అనేక ఉన్నత పదవులను అలంకరించినట్లు పేర్కొన్నారు. నగరానికి చెందిన పలు సాహితీ సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, బోడి ఆంజనేయరాజు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నావల్లభరావు, ఏపీ రచయితల సంఘం సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎస్టీవీఆర్ విద్యార్థిని



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలక సంస్థ పాఠశాల విద్యార్థి బొగిలి ప్రియాంక జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగిన 67వ రాష్ట్ర స్థాయి అండర్ 19 అథ్లెటిక్స్ పోటీల్లో 3000 మీటర్స్ రైస్ వాకింగ్ విభాగంలో బొగిలి ప్రియాంక అత్యుత్తమ ప్రదర్శనతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున పాల్గొనేందుకు ప్రియాంకను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ప్రియాంకను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సూర్యప్రభ, ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి పాఠశాల నగర ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

మాస్టర్ మైండ్స్ స్కూల్‌కు ఎక్సెలెన్స్ అవార్డు

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 63వ డివిజన్‌లోని మాస్టర్ మైండ్స్ స్కూల్ దేశంలో అత్యున్నత విద్యాసంస్థలకు ఇచ్చే ప్రతిష్టాత్మక స్కూల్ ఎక్సెలెన్స్ అవార్డ్‌ను దక్కించుకుంది. హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం కార్యక్రమంలో స్కూల్ అధినేత పెంట్యాల అనిల్‌కుమార్‌కు అవార్డు ప్రదానం చేసినట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థుల పట్ల తన బాధ్యతలను రెట్టింపు చేసినట్లుగా భావిస్తానని అనిల్ పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న విధానం

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేద ప్రజల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గాంధీనగర్ 36వ డివిజన్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం శుక్రవారం జరిగింది. డివిజన్‌లోని 192, 193, 195, 196వ వార్డు సచివాలయాల పరిధిలో గత నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన బోర్డులను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆవిష్కరించారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా, స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి ఎమ్మెల్యే విష్ణు పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో తీసుకొచ్చిన సంస్కరణలు విప్లవాత్మకమని పేర్కొన్నారు. గ్రామ–వార్డు సచివాలయ వ్యవస్థ మొదలు జగనన్న ఆరోగ్య సురక్ష వరకు ప్రతి ఒక్కటీ ప్రజాదరణ పొందాయని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ పనికైనా సిఫార్సుల కోసం టీడీపీ నేతల చుట్టూ తిరగాల్సి వచ్చేదని.. కానీ తమ ప్రభుత్వంలో అధికార యంత్రాంగమంతా ప్రజల గుమ్మం వద్దకే వెళ్లి సంక్షేమం అందిస్తున్నారని వెల్లడించారు. జగనన్న ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశంలోని ఇతర రాష్ట్రాలను సైతం ఆకర్షిస్తున్నట్లు తెలిపారు. 192వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ. 4.96 కోట్ల మేలు జరిగిందన్నారు. 193వ సచివాలయ పరిధిలో రూ. 9.19 కోట్లు., 195వ సచివాలయ పరిధిలో రూ. 5.40 కోట్లు, 196వ సచివాలయ పరిధిలో రూ. 9.46 కోట్లు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని వివరించారు. జగనన్న సంక్షేమ రాజ్యంలో ప్రతి ఒక్క కుటుంబానికీ మంచి జరిగిందని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. ప్రజల ఆశీస్సులు తమ ప్రభుత్వానికి మెండుగా ఉన్నాయని చెప్పారు. చంద్రబాబు పాలనను ప్రజలు కోరుకోవట్లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు పులపా కృష్ణ, రామకృష్ణ, రెడ్యం ఆర్కే, రాడ భాస్కర్, యడ్ల రాంబాబు, పఠాన్ భూపతి, ఇప్పిలి శ్రీను, పప్పుల శివ, తాటి శివ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



36వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



57వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

57వ డివిజన్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరి పేటలోని 233, 234, 236, 237వ వార్డు సచివాలయాల పరిధిలో జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా, స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవీతో కలిసి శుక్రవారం పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి, మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. నాలుగు వార్డు సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు డీబీటీ ద్వారా రూ. 54.40 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 42 కోట్లు మొత్తంగా రూ. 96.40 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు మల్లాది విష్ణు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఇసరపు రాజు, కాళ్ల ఆదినారాయణ, శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, పఠాన్ నజీర్‌ఖాన్, ప్రేమ్, దుర్గాప్రసాద్, కనకారావు, రజియా, చిట్టెమ్మ, బాల, ఉత్తమ్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సెమీ క్రిస్మస్ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సెమీ క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ ఢిల్లీరావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన క్రైస్తవ మత పెద్దలు, చర్చి ఫాదర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. వేడుకలకు 2,500 మంది చర్చి ఫాదర్లు, 5వేల మందికి పైగా క్రైస్తవ సోదరులు హాజరవుతారన్నారు. వాతావరణంలో మార్పులు వచ్చినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. క్యాండిల్ లైట్ నిర్వహణకు తగిన ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిమాపక పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(లా అండ్ ఆర్డర్) డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్ 26వ వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడా జ్యోతిని వెలిగించి పోటీను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాదల పద్మజ మాట్లాడుతూ అండర్–14, అండర్ –17, బాలురు, బాలికలకు ఇంటర్ స్కూల్ పోటీలు జరుగుతుండగా, అందులో భాగంగా లాంగ్‌జంప్, షాట్‌పుట్, క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని 11 పాఠశాలల నుంచి 155 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. విజేతలకు శనివారం బహుమతులు, యోగ్యతాపత్రాలను, అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భవాని, హెడ్‌మిస్ట్రెస్ సీహెచ్ ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న అదనపు డీజీపీ శంఖబ్రత బాగ్చీ, నలంద ప్రిన్సిపాల్ మాదల పద్మజ



విద్యార్థుల ప్రదర్శన

నాలుగోదశ న్యూరోఎండో క్రైన్ క్యాన్సర్‌కు అరుదైన చికిత్స



ఎస్.సుబ్బారావు, మెడికల్ ఆంకాలజిస్ట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): అరుదైన, తీవ్రమైన నాలుగో దశలో ఉన్న న్యూరోఎండోక్రైన్ కార్సినోమా (క్యాన్సర్)తో బాధపడుతున్న 42 ఏళ్ల మహిళకు విజయవంతంగా చికిత్స చేసినట్లు అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ డైరెక్టర్, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎన్.సుబ్బారావు తెలిపారు. వినుకొండకు చెందిన 42 ఏళ్ల మహిళ మూడు నెలల వ్యవధిలో 10 కిలోల బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, మలబద్ధకం వంటి సమస్యలతో చికిత్సకోసం తమ వద్దకు వచ్చినట్లు తెలిపారు. ఆమెను పరీక్ష చేయగా సిగ్మోయిడ్ కోలన్‌లో అల్సెరోప్రొలిఫెరేటివ్ పెరుగుదలతో బాధపడుతున్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. బయాప్సీ చేయగా గ్రేడ్ 3 న్యూరోఎండోకిరన్ కార్సినోమాగా నిర్ధారించినట్లు తెలిపారు. సమగ్ర రోగ నిర్ధారణ పరీక్షల్లో నాలుగో దశలో ఉన్నట్లు తేలిందన్నారు. కాలేయ గాయాలు కూడా ఉన్నట్లు వెల్లడైందని డాక్టర్ సుబ్బారావు తెలిపారు.
రోగి బలహీనంగా ఉండటంతో పాటు, పొత్తికడుపు పెరగడం, రెండు కాళ్లలో వాపు , విపరీతమైన కడుపునొప్పి వంటి సమస్యలతో రోజులో సగం మంచానికే పరిమితమైనట్లు తెలిపారు. దీంతో ఆమెకు పాలియేటివ్ కీమోథెరపీ మొదటి సైకిల్ తర్వాత ట్యూమర్ లైసిస్ సిండ్రోమ్ అనే క్లిష్టమైన ఆంకోలాజికల్ ఎమర్జెన్సీని ఎదుర్కొన్నట్లు తెలిపారు. కీమో చేసిన పదిరోజుల్లో పొత్తికడుపునొప్పి తగ్గడం, మూత్రపిండాల పనితీరు మెరుగుపడిందని తెలిపారు. ఇలా అధునాతనంగా ఆరు కీమోథెరపీ సైకిల్స్‌ను విజయవతంగా చేయడంతో ఆమెకు పూర్తిగా నివారించగలిగామన్నారు. ఆమెకు పెట్‌స్కాన్ చేయగా వ్యాధి పూర్తిగా తగ్గుముఖం పట్టినట్లు డాక్టర్ సుబ్బారావు తెలిపారు. రోగికి చికిత్స అందించిన బృందంలో మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సృజన జోగా ఉన్నట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న 30వ డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 30వ డివిజన్ 251వ వార్డు సచివాలయం పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీ జానారెడ్డి నగరపాలకసంస్థ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన డివిజన్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా కోట్లాది రూపాయల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలిపారు.
అలాగే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్యకేంద్రం, ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.

టీడీపీ–జనసేనకు గుణపాఠం తప్పదు

రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్న టీడీపీ–జనసేనకు ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని మల్లాది విష్ణు అన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు అండ్‌కోకు తగిన శాస్తి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.
కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రమౌళి, తుంపాల వరప్రసాద్, సుబ్బారెడ్డి దుర్గారావు, రామకృష్ణ, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష విరమణల క్యూ లైన్ల పనులకు శ్రీకారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణల నేపథ్యంలో వినాయకుడి గుడి వద్ద శుక్రవారం క్యూ లైన్ల పనులకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావు, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు దీక్ష విరమణలు జరగనున్నాయి. తొలుత వినాయక దేవస్థానం వద్ద శ్రీకనకదుర్గమ్మ చిత్రపటం ఏర్పాటు చేసి ఆలయ వైదిక, అర్చక సిబ్బంది శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు కోటేశ్వరరావు, లింగం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు



విద్యార్థులకు జామెట్రీ బాక్సులు అందజేస్తున్న తోట శ్రీనివాస్



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ పూర్ణమ్మ, సిబ్బంది



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న హజరత్తయ్య గుప్తా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఆంధ్రరత్న పార్కు వద్ద పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలసి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ప్రాణ త్యాగం చేసిన ఆ మహనీయుని స్ఫూర్తితో నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందన్నారు. ఆయన చేసిన త్యాగాలకు గుర్తుగా మహానేత వైఎస్సార్ హయాంలో నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరు పెట్టి కీర్తించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. అలాగే నవంబర్ 1న ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగలా అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కొల్లూరు రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాస్, మైలవరపు రామకృష్ణ, బొగ్గరపు సత్యనారాయణ, నల్గొండ సుబ్బారావు, నరసింహారావు, కమ్మిలి రత్నకుమార్, చల్లా సుధాకర్, గోపాలకృష్ణ, లంకా బాబు తదితరులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో..

సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ విద్యార్థులతో కలసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్యాలంపాడు నగరపాలక సంస్థ పాఠశాలలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు గొట్టిముక్కల సూర్యనారాయణరాజు నగరపాలక సంస్థ పాఠశాలలో దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని విద్యార్థులకు జామెంట్రీ బాక్సుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్ సర్దార్ వల్లభాయ్ పటేల్, పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను కొనియాడారు. జాతీయ నేతల ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ జనరంజక పాలన సాగిస్తున్నారని అన్నారు. అనంతరం విద్యార్థులకు జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.పుష్పలత, ఉపాధ్యాయులు, వైఎస్సార్ సీపీ 61వ డివిజన్ అధ్యక్షుడు బల్లెం కిషోర్, అన్నపురెడ్డి రామిరెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి, కై కాల శరణ్, సాంబ, అంబేద్కర్, గోపి పాల్గొన్నారు.

పటమట(విజయవాడతూర్పు): భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పోరాడిన మహనీయుడు పొట్టి శ్రీరాములని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, చీఫ్ ఇంజినీర్ ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, సెక్రటరీ వసంత లక్ష్మి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, మేనేజర్ బి.శ్రీనివాసరావు, వీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొనారు.

ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారన్నారు. కార్యక్రమంలో ఠాగూర్ గ్రంథాలయ అధికారిణి రమాదేవి, సిబ్బంది జి.ఉమారాణి, వై.ధనలక్ష్మి, డి.రమేష్, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ప్రాంతీయ కార్యాలయంలో..

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్‌లోని వాసవి క్లబ్ ప్రాంతీయ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించి స్కూల్ విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ రామచంద్రరావు, కొత్త గణేష్, సురేష్, సునీత, సుధీర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు శ్రీధర్మపరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన ధనుర్మాసోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవ, 5కు తిరుప్పావై సేవ, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందన్నారు. భక్తులు ధనుర్మాసోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

బాబా మందిరంలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో లక్ష్మీనారాయణలకు ప్రీతికరమైన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 17 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు లోక కళ్యాణార్థం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందని పారాయణ మండలి కన్వీనర్ మందలపర్తి సత్యశ్రీహరి తెలిపారు.